సాక్షి నిజామాబాద్

సోమవారం । 29 । మే । 2023



యథేచ్ఛగా ఆక్రమణలు

నగరంలోని పూలాంగ్ వాగు స్థలంలో యథేచ్ఛగా ఆక్రమణలు జరుగుతున్నా అధికారులు కన్నెత్తి చూడడం లేదు.

- 8లో ▸



మూడోసారి బీఆర్ఎస్‌దే..

రాష్ట్రంలో మూడోసారి బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం

41.4 /29.5

వాతావరణం

ఉదయం నుంచే ఎండ ప్రకాశవంతంగా ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. రాత్రి ఆకాశం నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ప్రజావాణి తాత్కాలిక వాయిదా

సుభాష్‌నగర్: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జూన్ 2 నుంచి ప్రభుత్వం అట్టహాసంగా నిర్వహించనున్న రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల ఏర్పాట్లలో నిమగ్నమై ఉండడం, ఇదే అంశంపై సోమవారం ఉదయం 10 గంటలకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించనున్నారని పేర్కొన్నారు. సమీక్షలో జిల్లా అధికారులు పాల్గొనాల్సి ఉన్నందున ప్రజావాణిని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాగానికి సహకరించాలని కలెక్టర్ కోరారు.

యోగాతో ఒత్తిళ్లు దూరం



నిజామాబాద్‌సిటీ: యోగాతో ఒత్తిళ్లు దూరమవుతాయని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి అన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు తమ జీవనశైలిలో మార్పు చేసుకుని ఒత్తిళ్లు తగ్గించుకోడానికి యోగా అలవాటు చేసుకోవాలని సూచించారు. నగరంలోని గంగాస్థాన్–2లో మూడు రోజులుగా హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్, శ్రీ రామచంద్ర మిషన్ కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖలు, ఐఎంఏ నిజామాబాద్ ఆధ్వర్యంలో జరుగుతున్న యోగా మహోత్సవం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ నిత్యం యోగా చేయడం ద్వారా అనేక ప్రయోజనాలున్నాయని, నిత్యం యోగా చేసేవారు వయస్సు పైబడినా ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం యోగా శిక్షకుడు కిషన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు నీలి రాంచందర్, ప్రధాన కార్యదర్శి జలగం తిరుపతిరావు, టీజీవో జిల్లా అధ్యక్షుడు బాబురావు, వైద్యులు బాపురెడ్డి, నగేశ్, లక్ష్మణ్, నిహారిక, ప్రకాశ్ పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ కేంద్రం సందర్శన

వేల్పూర్: వేల్పూర్ మండల కేంద్రంలో దుర్గాభాయి మహిళా శిశు వికాస కేంద్రం ఆధ్వర్యంలో కొనసాగుతున్న కుట్టు శిక్షణ కేంద్రాన్ని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, టీఎస్ డబ్ల్యూసీడీసీ రాష్ట్ర చైర్మన్ ఆకుల లలిత ఆదివారం రాత్రి సందర్శించారు. కుట్టు శిక్షణ, బ్యూటీషియన్ ఏ విధంగా కొనసాగుతున్నది, ఎంతమంది మహిళలు శిక్షణ తీసుకుంటున్నారని అడిగి తెలుసుకున్నారు. శిక్షణ కోసం ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా మహిళాకేంద్రం మేనేజర్ పద్మ, ఎంపీపీ బీమజమున, శిక్షకురాలు పడాల సురేఖ తదితరులు పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం



గాంధారి: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఆదివారం గాలి దుమారంతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో మండల కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసి కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన ధాన్యం, మొక్కజొన్న ఈ వర్షానికి భారీ వర్షం వరదకు కొట్టుకుపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈదురుగాలికి జువ్వాడి, బ్రాహ్మణ్‌పల్లి తదితర గ్రామాల్లో రేకుల ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయి బాధిత కుటుంబాలు వీధిన పడ్డాయి. ఇళ్లలో ఉన్న తిండి గింజలు, దుస్తులు తదితర సామాన్లు వర్షం నీటికి తడిసిపోయాయి. ఈదురు గాలులకు చెట్ల కొమ్మలు విరిగిపడి విద్యుత్‌కు అంతరాయం కలిగింది.

ఎలుగుబంటి సంచారంతో భయాందోళనలో ప్రజలు

తాడ్వాయి: మండలంలోని సంగోజివాడి శివారులో ఎలుగుబంటి సంచరించడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. సంగోజివాడి శివారులో శనివారం ఎలుగుబంటి సంచరించడంతో గ్రామస్తులు తరిమికొట్టారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన బాలసాయిలుపై ఎలుగుబంటి దాడిచేసి గాయపర్చింది. దీంతో గ్రామస్తులు కర్రలతో వెండించినప్పటికి ఎలుగుబంటి దొరకలేదు. కాగా ఆదివారం కూడా గ్రామస్తులు ఎలుగుబంటి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అయినా ఎలుగు బంటి కనిపించలేదు.



ప్రకృతి గీసిన చిత్రం

వెనకాల తాటి చెట్లు.. పొలం మధ్యలో ఎండిన చెట్టు.. దాని చుట్టూ గడ్డి ఉండలు.. గట్టుపై పరుచుకున్న పచ్చదనం.. ఇవన్నీ ఒకే ఫ్రేంలో కలిపి చూస్తే సినిమా సెట్టింగ్‌ను తలపిస్తోంది కదూ! అలా అనుకుంటే పొరపడినట్లే. కనువిందుగా ఉన్న ఈ ప్రకృతి చిత్రాన్ని డొంకేశ్వర్ మండలం అన్నారం వద్ద 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

– డొంకేశ్వర్(ఆర్మూర్)

డ్యామేజ్ ధాన్యం

కొనేదెవరు..!

- జిల్లాలో 30 వేల క్వింటాళ్ల తడిసిన ధాన్యం..!
- ప్రభుత్వానికి నివేదించిన అధికారులు
- రంగుమారిన, మొలకెత్తిన వడ్లను తూకం వేయొద్దని ఆదేశాలు
- ఆందోళనలో అన్నదాతలు



మాక్లూర్ మండలం మదన్‌పల్లి శివారులో మొలకెత్తిన ధాన్యం (ఫైల్)

సుభాష్‌నగర్ : జిల్లాలో అకాల వర్షాలకు 30 వేల క్వింటాళ్ల వరకు ధాన్యం డ్యామేజ్ (పదేపదే తడిసిపోయిన) అయినట్లు అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. ఏప్రిల్ 25 నుంచి మే 15 వరకు ఉరుములు, మెరుపులు, వడగళ్లతో కూడిన అకాల వర్షాలు కురిసిన విషయం తెలిసిందే. వర్షాలకు ఒకసారి తడిసిన సుమారు లక్షన్నర క్వింటాళ్ల వరకు ధాన్యాన్ని కొనుగోలు చేశారు. కానీ పదేపదే తడుస్తూ రంగుమారిన, మొలకెత్తిన ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం నుంచి అధికారికంగా ఆదేశాలు రాలేదని తెలిసింది. దీంతో మిల్లర్లు ఆ ధాన్యం దించుకునేందుకు ఆసక్తి చూపడంలేదు. ఈ క్రమంలో రైతులు ఆందోళన చెందుతున్నారు.

5.65 మెట్రిక్ టన్నుల ధాన్యం

జిల్లాలో ఇప్పటివరకు 5.65 మెట్రిక్ టన్నుల ధాన్యం 79 వేల మంది రైతుల కొనుగోలు చేశారు. 396 కేంద్రాల ద్వారా సేకరిస్తున్నారు. మరో 60 వేల క్వింటాళ్ల వరకు ధాన్యం ఉందని అధికారులు భావిస్తున్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన 10 రోజుల్లోనే వర్షాలు కురిసాయి. దాదాపు 70 శాతం వరకు ధాన్యం తడిసింది. అయినప్పటికీ సుమారు లక్షన్నర మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇందులో క్వింటాలుకు 8 నుంచి 10 కిలోల వరకు తరుగు తీసుకున్నారు. కొన్నిసార్లు ధాన్యం లారీని వెనక్కి పంపించిన ఘటనలు చోటుచేసుకున్నాయి. కానీ పదేపదే తడిసి రంగు మారిన, మొలకెత్తిన ధాన్యం మిల్లర్లు దించుకోవడం లేదు.

ఇబ్బందులు పడుతున్న రైతులు

రంగు మారిన, మొలకెత్తిన ధాన్యం కొనుగోలు చేయవద్దని చెప్పడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆ ధాన్యాన్ని ఏం చేసుకోవాలని పదేపదే సొసైటీ సీఈవోలను నిలదీస్తున్నారు. ప్రైవేట్ మార్కెట్‌లో రూ. 1,500 కూడా పలకడం లేదు. అటు వర్షాలకు.. ఇటు కొనుగోలు చేయక రైతులు తీవ్రంగా నష్టపోయారు. డ్యామేజ్ ధాన్యాన్ని ప్రైవేట్ మార్కెట్‌లోనే విక్రయించుకోవడం తప్ప మరో మార్గం లేకుండా పోయింది. ప్రభుత్వం స్పందించి డ్యామేజ్ అయిన ధాన్యం కొనుగోలు చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై డీఎస్‌వో చంద్రప్రకాశ్‌ను సంప్రదించగా, డ్యామేజ్ అయిన ధాన్యం వివరాలను ప్రభుత్వానికి నివేదికలు పంపించామని, వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు చేపడుతామని పేర్కొన్నారు.

సొసైటీల నుంచి వివరాల సేకరణ



అకాల వర్షాలకు రంగు మారిన, మొలకెత్తిన ధాన్యం వివరాలను సొసైటీల నుంచి సేకరించారు. సుమారు 30వేల క్వింటాళ్లు ఉన్నట్లు తెలిసింది. ఆ వివరాలను ప్రభుత్వానికి నివేదించారు. అంతకుముందే డ్యామేజ్ ధాన్యం తూకం వేయవద్దని కేంద్రాల నిర్వాహకులకు ఆదేశాలిచ్చారు. ప్రస్తుతం ఆ ధాన్యాన్ని కాంటాలు వేయడం లేదు. డ్యామేజ్ అయిన ధాన్యాన్ని రైస్‌మిల్లర్లకు పంపించి మిల్లింగ్ చేసి ఇస్తే ఎఫ్‌సీఐ రిజెక్ట్ చేస్తుందనే వాదన వారి నుంచి వస్తోంది. ఆ ధాన్యం దించుకుంటే తమకు నష్టం వాటిల్లుతోందని రైస్‌మిల్లర్లు వాపోతున్నారు.

విచ్చలవిడిగా నకిలీ పాస్‌పోర్టులు!

- శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అరెస్టయిన వేల్పూర్ వాసి
- మరోసారి వెలుగులోకి వచ్చిన నకిలీ పాస్‌పోర్టుల తతంగం
- గతంలో బోధన్‌లో వెలుగుచూసిన వ్యవహారం



మోర్తాడ్(బాల్కొండ) : పాస్‌పోర్టుల జారీలో విదేశాంగ శాఖ ఎన్నో కఠిన నిబంధనలను అమలులోకి తీసుకువచ్చినా నకిలీ పాస్‌పోర్టుల జారీ యథేచ్ఛగా కొనసాగుతూనే ఉంది. బోధన్ కేంద్రంగా రోహింగ్యాలకు భారీ సంఖ్యలో పాస్‌పోర్టుల జారీ కుంభకోణం వెలుగులోకి వచ్చినా జిల్లాలోని స్పెషల్ బ్రాంచ్ పోలీసులు ఇంకా జాగ్రత్తలు తీసుకోవడం లేదని తాజాగా చోటు చేసుకున్న ఘటనతో స్పష్టమవుతోంది. వేల్పూర్‌కు చెందిన మురళి అనే వ్యక్తి గతంలోనే యూఏఈలోని దుబాయ్‌కు వెళ్లి వచ్చాడు. ఆయన మొదట తీసుకున్న పాస్‌పోర్టులో వయస్సు ఎక్కువగా నమోదైంది. అదే పాస్‌పోర్టుతో మళ్లీ దుబాయ్‌కు వెళ్తే ఉపాధి లభించే అవకాశం లేదు. అందువల్ల వయస్సు తగ్గించి కొత్త పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసుకోగా దళారి జోక్యంతో రెండో పాస్‌పోర్టు చేతికి అందింది. శుక్రవారం అతను దుబాయ్‌కు వెళ్లగా అక్కడ ఇమిగ్రేషన్ అధికారులు వేలిముద్రలను పరిశీలించారు. మురళికి గతంలో ఒక పాస్‌పోర్టు జారీ చేశారని, ఇప్పుడు మరో పాస్‌పోర్టుతో యూఏఈలో అడుగుపెడుతున్నాడని గుర్తించి అక్కడి పోలీసులు ఎయిర్‌పోర్టు నుంచి తిరిగి శంషాబాద్‌కు తరలించారు. శనివారం ఇక్కడికి చేరుకున్న మురళిపై శంషాబాద్ పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. ఒక వ్యక్తికి ఒక్కటే పాస్‌పోర్టు ఉండాలనే నిబంధన మన విదేశాంగ శాఖ అమలు చేస్తోంది. గతంలో తప్పుడు ధ్రువపత్రాలతో అనేక మంది రెండు, మూడు పాస్‌పోర్టులను పొందారు. విదేశాల్లో ఉపాధి కోసం వచ్చేవారి నుంచి వేలిముద్రలను సేకరించే విధానం అమలులోకి రావడం వల్ల నకిలీ పాస్‌పోర్టులు ఉంటే వెంటనే గుర్తించే అవకాశం ఉంది. విదేశాంగ శాఖ దీనిని సీరియస్‌గా తీసుకుని నిబంధనలకు విరుద్ధంగా పాస్‌పోర్టుల జారీని నియంత్రించడానికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. అయినప్పటికీ కొందరు అవినీతిపరులు నకిలీ పాస్‌పోర్టులు చేతికి అందేలా చక్రం తిప్పుతున్నారు.

ఆధార్ సెంటర్లలో మొదలై..
ఎస్‌బీ వరకు అక్రమాలు..

నకిలీ పాస్‌పోర్టుల కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఆధార్ సెంటర్లలోనే మొదట అక్రమాలు జరుగుతున్నాయి. ఒక వ్యక్తికి వయస్సును తగ్గించడం, పెంచడం, అడ్రస్‌ను మార్చడం మొదలుకొని, స్పెషల్ బ్రాంచ్ పోలీసుల విచారణ వరకు అన్ని చోట్ల అక్రమాలు చోటు చేసుకుంటుండడంతోనే నకిలీ పాస్‌పోర్టుల జారీకి అడ్డు అదుపూ లేకుండా సాగుతుంది. ఇప్పటికైనా విదేశాంగ శాఖ ఉన్నతాధికారులు, పోలీసు యంత్రాంగం స్పందించి నకిలీ పాస్‌పోర్టుల జారీకి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉంది.

భారీ మొత్తంలో వసూలు

నకిలీ పాస్‌పోర్టుల కోసం స్పెషల్ బ్రాంచ్ అధికారులు భారీ మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నకిలీ పాస్‌పోర్టుల దరఖాస్తులపై విచారణ జరిపి ఒకే చేయడానికి రూ. 15వేల నుంచి రూ. 50వేల వరకు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. బోధన్‌లో మొదట ఎనిమిది మందికి అక్రమంగా పాస్‌పోర్టులను జారీ చేశారని హైదరాబాద్‌లోని ప్రత్యేక పోలీసు విభాగం గుర్తించింది. దీనిపై విచారణ జరిపితే 80 మంది రోహింగ్యాలకు అక్రమంగా పాస్‌పోర్టులను నకిలీ ధ్రువపత్రాలపై జారీ చేసినట్లు తేలింది. ఒక్కో పాస్‌పోర్టు కోసం రూ. 2లక్షల వరకు చేతులు మారినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది.

విపక్షాలపై హరీశ్‌రావు ఫైర్!

- కాంగ్రెస్‌కు కాలం చెల్లింది.. బీజేపీ సప్పుడు బంద్దైంది
- మూడోసారి కూడా అధికారం బీఆర్ఎస్‌దే..
- శ్రేణుల్లో జోష్ నింపిన మంత్రి పర్యటన



సభలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

సాక్షి, కామారెడ్డి: 'రాష్ట్రంలో కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీ మూడోసారి అధికారం చేపట్టి హాట్రిక్ కొట్టడం ఖాయం. ప్రతిపక్ష పార్టీలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయి. విషం చిమ్మే ప్రయత్నాలను విషయంతో తిప్పికొట్టాలి. కాంగ్రెస్‌కు కాలం చెల్లింది. బీజేపీ సప్పుడు బంద్దైంది' అని రాష్ట్ర ఆర్థిక, వైద్య, ఆరోగ్యశాఖల మంత్రి హరీశ్‌రావు అన్నారు. విపక్ష పార్టీలపై తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఆది వారం పర్యటించారు. లింగంపేట మండల కేంద్రంలో జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 2001 లో టీఆర్ఎస్ పురుడు పోసుకున్నప్పుడు సురేందర్ పార్టీ జెండా మోసిన అసలైన ఉద్యమకారుడని హరీశ్‌రావు పేర్కొన్నారు. అప్పుడు జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎల్లారెడ్డి నియోజకవర్గంలో జెడ్పీటీసీ స్థానాలను కైవసం చేసుకోవడం వల్లే ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పరిషత్‌పై గులాబీ జెండా ఎగిరిందని గుర్తుచేశారు. కాంగ్రెస్‌కు రాష్ట్రంలో నలభై, యాభై నియోజకవర్గాల్లో అభ్యర్థులే లేరని, ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తూ అధికారంలోకి వస్తామని కలలు కంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీలు చేస్తున్న తప్పుడు ప్రచారాలను తిప్పకొట్టకుంటే అబద్ధాలు రాజ్యమేలుతాయన్నారు. ప్రతిపక్ష పార్టీలు ప్రకృతి వైపరీత్యాల కన్నా డేంజర్ అని దుయ్యబట్టారు. హరీశ్‌రావు పర్యటన బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ నింపింది.

ఎల్లారెడ్డి నియోజక వర్గానికి త్వరలోనే సీఎం కేసీఆర్ వస్తారని, పెద్ద ఎత్తున వరాలు తీసుకుందామని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు.

ప్రతిష్టను దెబ్బతీసే కుట్రలు

ఎవరైనా మన ప్రాంతం గురించి గొప్పగా చెప్పుకోవాల్సింది పోయి.. ప్రతిష్టను దెబ్బతీసేలా ప్రతిపక్షాలు దుష్ప్రచారాలు చేస్తున్నాయని మంత్రి ఆరోపించారు. తెలంగాణలో కేసీఆర్ నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధి పనులు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. మహారాష్ట్రలో అక్కడి రైతులు తెలంగాణలో ఉన్నట్టుగా రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత కరెంటు అడుగుతున్నారని తెలిపారు. తెలంగాణలో ఆసరా పింఛన్లు రూ. 2 వేలు ఇస్తున్నామని, దేశంలో మరెక్కడా ఇవ్వడం లేదన్నారు.

కేసీఆర్ నాయకత్వంలో..

కేసీఆర్ నాయకత్వంలో కొట్లాడి రాష్ట్రం సాధించుకున్నామని, ప్రజలు కేసీఆర్ నాయకత్వంపై విశ్వాసంతో రెండుసార్లు అధికారం ఇచ్చారని, మూడోసారి కూడా మనమే గెలిచి హ్యాట్రిక్ సాధిస్తామని హరీశ్‌రావ్ స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన సురేందర్ సౌమ్యుడని, నియోజక వర్గ అభివృద్ధికి నిరంతరం తపిస్తున్నాడని, ఈసారి కూడా ఆయన్నే విజయం సాధిస్తాడని పేర్కొన్నారు.

తెలంగాణ ప్రగతి ప్రతిబింబించాలి

- 'దశాబ్ది' సంబురాలు ఘనంగా నిర్వహించాలి
- అధికారులు, ప్రజాప్రతినిధులకు మంత్రి ప్రశాంత్‌రెడ్డి పిలుపు




సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి, పాల్గొన్న ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి తదితరులు

సుభాష్‌నగర్: తెలంగాణ సాధించిన ప్రగతి ప్రతిబింబించేలా రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను అట్టహాసంగా నిర్వహించాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములను చేస్తూ, పల్లెపల్లెన తెలంగాణ ప్రగతిని ఆవిష్కరింపజేయాలని సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పరస్పర సహకారంతో పనిచేస్తూ దశాబ్ది ఉత్సవాలు విజయవంతం చేసేందుకు కృషిచేయాలన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆదివారం ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా, జెడ్పీ చైర్మన్ విఠల్ రావు, టీఎస్‌డబ్ల్యూసీడీఐ చైర్‌పర్సన్ ఆకుల లలిత, మేయర్ నీతూ కిరణ్, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి మంత్రి ప్రశాంత్‌రెడ్డి దశాబ్ది ఉత్సవ ఏర్పాట్లపై అధికారులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో సమావేశమై వారికి దిశానిర్దేశం చేశారు. ఆరు దశాబ్దాలకు పైగా అలుపెరుగని పోరాటం చేసి సాధించుకున్న తెలంగాణను సీఎం కేసీఆర్ తన దార్శనిక పాలనతో కేవలం తొమ్మిదేళ్లలోనే యావత్ దేశం ఆశ్చర్యపోయే రీతిలో అనేక రంగాల్లో అభివృద్ధి చేశారన్నారు.

ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, అన్ని వర్గాల వారి కృషితో గడిచిన తొమ్మిదేళ్లలో రాష్ట్రం సాధించిన అభివృద్ధి, అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తోందన్నారు. శాఖల వారీగా కరపత్రాలు, ఫ్లెక్సీలు, బుక్‌లెట్ల ద్వారా ప్రజలకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. జూన్ 2వ తేదీ నుంచి 22 వరకు దశాబ్ది ఉత్సవాలు కొనసాగుతాయన్నారు. సమావేశంలో నుడా చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, చిత్రామిశ్రా, డీఎఫ్‌వో వికాస్ మీనా, జెడ్పీ సీఈవో గోవింద్, డీఆర్‌డీవో చందర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం



సీటీ స్కాన్ మిషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి

నిజామాబాద్ సిటీ: పేద ప్రజలకు సైతం కార్పొరేట్ తరహా వైద్య సేవలను ఉచితంగా అందుబాటులోకి తేవాలని రాష్ట్ర ప్రభుత్వం వైద్యారోగ్య శాఖపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తోందని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రూ. 2.14 కోట్లతో నూతనంగా ఏర్పాటు చేసిన సీటీ స్కాన్ యంత్రం, రూ. 30లక్షలతో ఏర్పాటు చేసిన ఐ ఫాకో మిషన్, రూ. 7 లక్షలతో నెలకొల్పిన 500 ఎంఏ ఎక్స్‌రే యూనిట్లను, మానసిక చికిత్సా విభాగాన్ని మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఆదివారం జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, మేయర్ నీతూ కిరణ్ తదితరులతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదలకు భారంగా మారిన సీటీ స్కాన్ సేవలు జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఉచితంగా అందుబాటులోకి రావడం సంతోషంగా ఉందన్నారు. ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలను మెరుగుపర్చేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులను వెచ్చిస్తోందన్నారు. సీటీ స్కాన్ బయట చేయించుకునేందుకు పేద కుటుంబాల వారు ఆర్థిక ఇబ్బందులు పడాల్సివచ్చేదని, ప్రస్తుతం జీజీహెచ్‌లో అందుబాటులోకి వచ్చిందన్నారు. 400 డిజిటల్ బీపీ మెషిన్లను సైతం జిల్లాకు కేటాయించారని, వీటిని ఏఎన్ఎంలకు కేటాయిస్తూ వారి ద్వారా గ్రామగ్రామాన ప్రజలకు సేవలందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ ఆకుల లలిత, డీఎంహెచ్‌వో సుదర్శనం, జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమా రాజ్, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఇందిరా, మానసిక వైద్య నిపుణులు విశాల్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

మంత్రిని కలిసిన తెయూ కాంట్రాక్టు అధ్యాపకులు



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులు ఆదివారం రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌ రెడ్డిని కలిసి తమను రెగ్యులరైజ్‌ చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీస్‌ కాంట్రాక్ట్‌ టీచర్స్‌ అసోసియేషన్‌ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్‌ నారాయణగుప్తా మాట్లాడుతూ.. యూనివర్సిటీ కాంట్రాక్ట్‌ అధ్యాపకులకు న్యాయం చేయాలని విన్నవించారు. తాము అన్ని విధాల అర్హతలు కలిగి ఉన్నామని, బోధనలో సుదీర్ఘ అనుభవం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్‌ 16 తీసుకువచ్చి జూనియర్‌, డిగ్రీ లెక్చరర్లను రెగ్యులర్‌ చేసిందని, త్వరలోనే యూనివర్సిటీలలో పని చేస్తున్న కాంట్రాక్ట్‌ అధ్యాపకులను కూడా రెగ్యులర్‌ చేయడానికి సానుకూలంగా ఉందని మంత్రి పేర్కొన్నారు. సీఎం కేసీఆర్‌ దృష్టికి తీసుకెళ్లి మీ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో తెయూ పరిధిలోని మెయిన్‌ క్యాంపస్‌, సౌత్‌ క్యాంపస్‌, ఎడ్యుకేషన్‌ క్యాంపస్‌ కాంట్రాక్టు అధ్యాపకులున్నారు.

రేపు టెన్నికాయిట్‌ క్రీడాకారుల ఎంపిక

కామారెడ్డిఅర్బన్‌: రామారెడ్డి మండలం రెడ్డిపేట జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో ఈ నెల 30న సీనియర్‌ టెన్నికాయిట్‌ క్రీడాకారుల ఎంపిక నిర్వహించనున్నట్లు అసోసియేషన్‌ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌ మోహన్‌, సాయిమౌర్య ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు జూన్‌ 2, 3, 4 తేదీల్లో రంగారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్ర సీనియర్‌ అంతర జిల్లాల సీనియర్‌ టెన్నికాయిట్‌ ఛాంపియన్‌-2023 మహిళలు, పురుషుల పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు ధ్రువపత్రాలతో పాల్గొనాలని కోరారు. వివరాలకు 9550909259 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



బీబీపేట/దోమకొండ: గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం బీబీపేట, దోమకొండలో మహిళలకు ప్రపంచ రుతుస్రావం పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన డీపీఎం రమేష్‌ బాబు మాట్లాడుతూ మహిళలు పీరియడ్స్‌ సమయంలో సరియైన జాగ్రత్తలు పాటించాలని లేకపోతే అనారోగ్యానికి గురవుతారన్నారు. పాఠశాలల్లోనూ ఇది ఒక అంశంగా చేర్చాలని అప్పుడే బాలికలకు అవగాహన ఉంటుందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏపై దాడి చేసిన వ్యక్తిపై కేసు

బోధన్‌రూరల్‌: ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే అడ్డుకున్న వీఆర్‌ఏపై సర్పంచ్‌ తనయుడు దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బోధన్‌ రూరల్‌ ఎస్సై సందీప్‌ తెలిపిన వివరాలు.. సాలూరా మండలంలోని ఖాజాపూర్‌లో రాత్రి సమయంలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను గ్రామంలో విధులు నిర్వహిస్తున్న వీఆర్‌ఏ భీరావ్‌ అడ్డుకున్నాడు. దీంతో తనపై హున్స సర్పంచ్‌ తనయుడు చిల శంకర్‌ దాడి చేశాడని భీరావ్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పడకల్‌లో జెడ్పీహెచ్‌ఎస్‌ 2006-07 ఎస్సెస్సీ బ్యాచ్‌ విద్యార్థుల సమ్మేళనం



రెంజర్ల ఉన్నత పాఠశాల 2002-03 బ్యాచ్‌ విద్యార్థులు



మత్తమాల పాఠశాల 1999-2000 బ్యాచ్‌ ఏడో తరగతి విద్యార్థులు

సాక్షి, నెట్‌వర్క్‌: ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న వారంతా ఒకచోట చేరారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. జిల్లాలోని పలు పాఠశాల్లలో పదో తరగతి, ఏడో తరగతి బ్యాచ్‌లకు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు విద్యా బుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.



బోధన్‌లో 1983-84 బ్యాచ్‌ ఎస్సెస్సీ విద్యార్థులు



ఆలూరులో 2000-01 బ్యాచ్‌ విద్యార్థులు



సదాశివనగర్‌లో 1997-98 బ్యాచ్‌ విద్యార్థులు



మోర్తాడ్‌లో 1972-73 బ్యాచ్‌ విద్యార్థులు



చందూర్‌ హైస్కూల్‌ 2003-04 ఎస్సెస్సీ బ్యాచ్‌ విద్యార్థులు



శ్రీనూతన వైశ్య ఉన్నత పాఠశాల 1994-95 బ్యాచ్‌ విద్యార్థులు

మూడోసారి బీఆర్‌ఎస్‌దే అధికారం

మోపాల్‌(నిజామాబాద్‌రూరల్‌): కాంగ్రెస్‌, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులిద్దరూ సీఎం కుర్చీ కోసమే కొట్లాడుతున్నారని, సీఎం కేసీఆర్‌ మాత్రం అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజల బాగోగుల కోసం నిత్యం తండ్లాడుతుంటారని, రాష్ట్రంలో మూడోసారి బీఆర్‌ఎస్‌ అధికారంలోకి రావడం ఖాయమని ఆర్టీసీ చైర్మన్‌, నిజామాబాద్‌ రూరల్‌ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ పేర్కొన్నారు. నగరశివారులోని బోర్గాం(పి) మోటాటిరెడ్డి కల్యాణ మండపంలో బీఆర్‌ఎస్‌ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా బాజిరెడ్డి గోవర్ధన్‌ మాట్లాడుతూ.. గత పాలనకు, ప్రస్తుత పాలనకు తేడాను ప్రజలు గమనించారని, దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా పథకాలు అమల్జేస్తున్నారన్నారు. ఇవాళ ఏం వారం.. రేపు ఏం వారం అంటూ బండి సంజయ్‌ మాట్లాడుతున్నారని, కేసీఆర్‌ మాత్రం ప్రజలకు ఏం చేద్దామని ఆలోచిస్తారని పేర్కొన్నారు. హిందువుల పేర్లు చెప్పుకుని పబ్బం గడుపుతున్న బీజేపీ వల్ల హిందువులకే ప్రమాదం పొంచి ఉందని, ప్రజలు గమనించాలని విజ్ఞప్తిచేశారు. నిజామామాద్‌ రూరల్‌ నియోజకవర్గంలో 70 దేవాలయాలు కట్టించామని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు జూన్‌ 2 నుంచి 22వ తేదీ వరకూ ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు.



మాట్లాడుతున్న ఆర్టీసీ చైర్మన్‌ బాజిరెడ్డి గోవర్ధన్‌

90శాతం పనులు పూర్తి..

మంచిప్ప రిజర్వాయర్‌ పనులు 90 శాతం పూర్తయ్యాయని, కట్ట పోసి, మూడెకరాలకు పైపులు వేయడమే మిగిలిందని బాజిరెడ్డి గోవర్ధన్‌ అన్నారు. కాంగ్రెస్‌, బీజేపీ వారు ప్రాజెక్టు పనులకు మోకాలడ్డుతున్నారని, ప్రాజెక్ట్‌ పూర్తయితే తమకు పుట్టగతులు ఉండవని ప్రతిపక్షాలకు భయం పట్టుకుందన్నారు. బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు మొచ్చ శ్రీనివాస్‌, ఎంపీపీ లతా కన్నీరాం, వైస్‌ ఎంపీపీ అనిత ప్రతాప్‌సింగ్‌, రైతుబంధు అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, నుడా డైరెక్టర్లు అభిలాష్‌రెడ్డి, శ్రీహరి, డీసీసీబీ డైరెక్టర్లు చంద్రశేఖర్‌రెడ్డి, గోర్కంటి లింగం, తదితరులు పాల్గొన్నారు.

ఆగని తరుగు దోపిడీ

- మంత్రి, అధికారులు హెచ్చరించినా మారని మిల్లర్ల తీరు

మోర్తాడ్‌: యాసంగి ధాన్యం కొనుగోళ్లలో తరుగు తీయడం కొనసాగిస్తే మిలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్‌, జిల్లాకు చెందిన మంత్రి ప్రశాంత్‌ రెడ్డి హెచ్చరించినా మిలర్లు మాత్రం తీరు మార్చుకోవడం లేదు. తాజాగా తాళ్లరాంపూర్‌ సహకార సంఘం నుంచి నిజామాబాద్‌ పరిసరాల్లోని ఒక మిల్లుకు ధాన్యం లోడ్‌ పంపించగా 24 క్వింటాళ్ల ధాన్యం తరుగు తీయడం బయటపడింది. తొమ్మిది మంది రైతులకు సంబంధించిన 702 బస్తాల ధాన్యం తరలించారు. అంటే 280 క్వింటాళ్ల ధాన్యం మిల్లుకు తరలించగా అక్కడ తరుగు తీయడంతో 256 క్వింటాళ్ల ధాన్యానికే రైతులకు సొమ్ము జమకానుంది. 24 క్వింటాళ్ల ధాన్యం తరుగు కింద పోవడంతో రైతులు రూ.49 వేలు నష్టపోతున్నారు. కొనుగోలు కేంద్రం నుంచి తరలించిన ధాన్యం లెక్కలకు అన్‌లోడింగ్‌ లెక్కలకు తేడా ఉండటంతో తరుగు తతంగం బహిర్గతమైతుంది. ఒక్కో లారీకి రైతులకు రూ.49వేలకు పైగా లోటు ఏర్పడితే కొనుగోళ్లు పూర్తి అయ్యే సరికి తరుగు నష్టం మరింత తీవ్రమైతుందనే వాదన వినిపిస్తుంది. బస్తాలో ధాన్యం తూకం వేసిన సమయంలోనే రెండు కిలోలు అదనంగా నింపి పంపిస్తున్నారు. ఆ రెండు కిలోల ధాన్యం లెక్కలోకి తీసుకోవడం లేదు. అయినప్పటికి మిల్లర్లు ధాన్యం అన్‌లోడింగ్‌ చేసుకునే సమయంలో పాత పద్ధతినే కొనసాగిస్తుండటంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారు. మంత్రుల హెచ్చరికలను మిల్లర్లు పెడచెవిన పెట్టినా ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రేక్షక పాత్ర వహించడం అనేక అనుమానాలకు తావిస్తుంది.



తాళ్లరాంపూర్‌ సొసైటీ ద్వారా రైస్‌మిల్లుకు పంపిన ధాన్యం ట్రక్‌షీట్‌

విచారణ జరిపించాలి



తరుగు దోపిడీపై సమగ్ర విచారణ జరిపించాలి. తరుగు తీయడం లేదంటూనే దోపిడీకి అవకాశం ఇవ్వడం ఎంత వరకు సమంజసం. తరుగు దోపిడిలో అందరికి వాటా ఉండటం వల్లనే హెచ్చరికలకు విలువ లేకుండా పోతుంది. రైతులను ముంచితే చూస్తూ ఊరుకోం. దీనికి మంత్రి ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు సమాధానం చెప్పి తీరాలి.

– మానాల మోహన్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్‌ కమిటీ అధ్యక్షుడు

క్రైం కార్నర్‌

విద్యుత్‌ షాక్‌తో ఒకరి మృతి



దోమకొండ: విద్యుత్‌ షాక్‌తో మండలంలోని ముత్యంపేటకు చెందిన పున్న సాయిలు(50) మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని సంగమేశ్వర్‌ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై సుధాకర్‌ తెలిపిన వివరాలు.. సంగమేశ్వర్‌ గ్రామంలో సాయిలు ఓ బిల్డింగ్‌పై పెయింట్‌ వేస్తుండగా తన చేతిలో ఉన్న బ్రష్‌ పక్కనే ఉన్న 11 కేవీ హైటెన్షన్‌ విద్యుత్‌ తీగలకు తగిలింది. దీంతో కిందపడిపోయాడు. పక్కనే ఉన్న వారు చూసి కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు చేరుకుని ఆర్‌ఎంపీకి సమాచారం ఇవ్వగా అతను చేరుకుని పరీక్షలు నిర్వహించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

జీవితంపై విరక్తితో మహిళ ఆత్మహత్య

బాల్కొండ: మండలంలోని వన్నెల్‌(బి) గ్రామానికి చెందిన కానూరు పద్మ(45) ఆదివారం చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఏఎస్సై శంకర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. పద్మ కొంత కాలంగా మానసిక వ్యాధితో బాధపడుతుంది. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది చెరువులో దూకి బలవన్మరణానికి పాల్పడింది. మృతురాలికి భర్త, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరాకు కేసు నమోదు చేశామని ఏఎస్సై చెప్పారు.

అంగడిలో సెల్‌ఫోన్ల చోరీ

భిక్కనూరు: మండల కేంద్రంలో ఆదివారం జరిగిన అంగడిలో సెల్‌ఫోన్‌ దొంగలు రెచ్చిపోయారు. భిక్కనూరుకు చెందిన ఇద్దరి ఫోన్లు, పెద్దమల్లారెడ్డి, ఇసన్నపల్లి గ్రామానికి చెందిన వ్యక్తుల ఫోన్లను ఎత్తుకుపోయారు. ఈ విషయమై ఇద్దరు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గుడిసె దగ్ధం



సాహెబ్‌పేట్‌లో కాలిపోయిన గుడిసె

వేల్పూర్‌: మండలంలోని సాహెబ్‌పేట్‌లో ఆదివారం వేకువజామున విద్యుత్‌ షార్ట్‌సర్క్యూట్‌తో బట్టు రవికి చెందిన పూరి గుడిసె కాలిపోయింది. సర్పంచ్‌ కైరి సుధాకర్‌గౌడ్‌ తెలిపిన వివరాలు.. బట్టు రవి, భార్య కుమార్తెతో కలిసి శనివారం రాత్రి ఇంట్లో పడుకున్నాడు. తెల్లవారు జామున మంటలు అంటుకోవడంతో వేడికి నిద్రలేచాడు. మంటలు గమనించి భార్య, కుమార్తెను తీసుకొని దూరంగా వెళ్లాడు. మంటలు వేగంగా వ్యాపించడంతో గుడిసె పూర్తిగా కాలిపోయింది. సుమారు రూ.రెండు లక్షల నష్టం వాటిల్లినట్లు చెప్పారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పి వేశారు. రవికి సర్పంచ్‌ రూ.5 వేల ఆర్థికసాయం అందించారు.

యథేచ్ఛగా ఆక్రమణలు!



పూలాంగ్‌ వాగు పక్కన చేపట్టిన నిర్మాణం

- పూలాంగ్‌ వాగు కబ్జా చేసి నిర్మాణాలు
- పట్టించుకోని అధికారులు

నిజామాబాద్‌ నాగారం: టౌన్‌ప్లానింగ్‌లో ముడుపులు ఇచ్చుకో.. క్షణాల్లో పని పూర్తి చేసుకో.. అనే నానుడి బాగా పాపులర్‌ అయింది. పూలాంగ్‌ వాగులో ఇరిగేషన్‌కు సంబంధించిన స్థలంలో పెద్ద ఎత్తున ఆక్రమణలు జరుగుతున్నా అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడడం లేదు. వాగుకు ఇరువైపులా 80మీటర్ల వరకు నిర్మాణాలు చేపట్టరాదు. ఈ నిబంధనలను తుంగలో తొక్కిమరీ ఆక్రమణలు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు ముడుపులు అందుకొని ఏమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

మున్సిపల్‌ ఆదాయానికి గండి

అధికారులు, భవన నిర్మాణదారులతో కుమ్మక్కై బల్దియా ఆదాయానికి గండి కొడుతున్నారు. నగరంలోని వినాయకనగర్‌ ప్రాంతంలో సుమారు 6వేల గజాల్లో భవన నిర్మాణానికి పర్మిషన్‌ కోసం 2021లో (ఫైల్‌ నంబర్‌ 003626/బీపీ/డీటీసీపీ/3072/0022/2021) దరఖాస్తు పెట్టారు. ఇందుకు రూ.2,50,95,483 ఫీజు చెల్లించాల్సి ఉంది. అయితే ఈ దరఖాస్తును పెండింగ్‌లో పెట్టారు. మళ్లీ ఫైల్‌ నం.000047/ బీపీ/డీటీ సీపీ/3072/0001/2022 దరఖాస్తు పెట్టారు. ఇందుకు రూ.95,36,108 ఫీజు చెల్లించారు. దరఖాస్తుదారుడికి లబ్ధి చేకూర్చి అధికారులు సుమారుగా రూ. కోటి 55లక్షల మున్సిపల్‌ ఆదాయానికి గండి కొట్టారు. ఇందుకోసం లైసెన్సు సర్వేయర్‌, టౌన్‌ ప్లానింగ్‌ అధికారులు పెద్ద ఎత్తున ముడుపులు తీసుకున్నారనే విమర్శలు ఉన్నాయి. ముచ్చటగా మూడోసారి తాజాగా సెట్‌ బ్యాక్‌లో మార్పిడి చేసి మరల పర్మిషన్‌ ఇచ్చారు. ఫైల్‌ నం. 000007/ బీపీ/డీ టీసీపీ/0001/2023కు అనుమతి వచ్చింది. హైదరాబాద్‌లో ఉన్నతాధికారులకు కూడా భారీగా ముట్టజెప్పి తక్కువ ఫీజుకే భవనానికి సంబంధించి పర్మిషన్‌ ఇప్పించినట్లు సమాచారం.

హైదరాబాద్‌లో అనుమతి..

నిజామాబాద్‌ మున్సిపాలిటీ పరిధిలో 1000 గజాల లోపు స్థలంలో భవనాలు నిర్మిస్తే అనుమతి ఇక్కడే తీసుకోవచ్చు. 1000 గజాలపైన స్థలంలో భవనాలు నిర్మిస్తే హైదరాబాద్‌ లోని డీటీసీపీ (డైరెక్టర్‌ ఆఫ్‌ టౌన్‌ అండ్‌ కంట్రీ ప్లానింగ్‌) నుంచి అనుమతి పొందాల్సిందే. అయితే దరఖాస్తు మాత్రం ఇక్కడే పెట్టాలి. దరఖాస్తు ప్రక్రియ అంతా మున్సి పాలిటీ పరిధిలోని టౌన్‌ ప్లానింగ్‌, కొంతమంది లైసెన్సు సర్వేయర్లు చేయాల్సిందే. దీంతో సదరు అధికారులు ముడుపులు తీసుకొని మున్సిపాలిటీకి వచ్చే ఆదాయానికి గండి కొడుతున్నారు.

కబ్జా చేశారని ఫిర్యాదు

వినాయక్‌ నగర్‌లో భారీ భవన నిర్మాణంలో తన భూమి కబ్జా చేశారని ఈ నెల 19న మున్సిపల్‌ కమిషనర్‌కు సుదర్శన్‌ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. దీనిపై పరిశీలన చేసి కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

భారీగా ఇసుక డంపులు

- రైతులు ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

రెంజల్‌: మండలంలో భారీగా ఇసుక అక్రమ డంపులు దర్శనమిస్తున్నాయి. గోదావరి, మంజీర నదులను కొల్లగొడుతూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. పగలు ట్రాక్టర్ల ద్వారా నదుల నుంచి ఇసుక తీసుకువచ్చి అనుకూలమైన ప్రదేశాల్లో నిల్వ చేస్తున్నారు. రాత్రి పూట హద్దులు దాటిస్తున్నారు. నిర్మల్‌ జిల్లా బాసరలోని ట్రిపుల్‌ ఐటీతో పాటు భైంసా, నిజామాబాద్‌ పట్టణాలకు నిత్యం పదుల సంఖ్యలో టిప్పర్లు తరలి వెళ్తున్నాయి. రెండు నదుల నుంచి జోజర్ల సాయంతో ఇసుకను తొడేస్తుండటంతో మండలం ఉన్న టిప్పర్లతో పాటు బోధన్‌, నిజామాబాద్‌కు చెందిన అక్రమార్కుల టిప్పర్లు వచ్చి చేరుతున్నాయి. కందకుర్తి గ్రామ శివారులో ఎక్కడ చూసినా ఇసుక నిల్వలు దర్శనమిస్తుండగా కందకుర్తి నుంచి తీసుకువచ్చిన ఇసుకను పేపర్‌మిల్‌, నీలా, సాటాపూర్‌ గ్రామాల్లో నిల్వ చేసుకుంటున్నారు.

మండలంలో రాత్రింబవళ్లు రోడ్లపై ఇసుక టిప్పర్లు దూసుకపోతున్నాయి. అతివేగంతో ప్రమాదాలు జరుగుతుండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులకు ఫోన్‌ ద్వార సమాచారం అందించినా పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. రెండు రోజుల కిందట జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో కందకుర్తి సర్పంచ్‌ ఖలీంబేగ్‌ ఇసుక అక్రమ రవాణాపై తహసీల్దార్‌ను ప్రశ్నించారు. కందకుర్తి గ్రామంలో ఎక్కడపడితే అక్కడ అక్రమార్కులు ఇసుకను డంప్‌ చేయడంతో స్థానిక రైతులు తరలి వచ్చి ఇటీవల తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. పంట పొలాలు దెబ్బతింటున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేసినా అధికారులు అటు వైపు కన్నెత్తి చూడలేదు. బరి తెగించిన అక్రమార్కులు రైతులను బెదిరిస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.



కందకుర్తి శివారులోని వనదుర్గ ఆలయం వద్ద ఇసుక డంపులు

అనాథలైన చిన్నారులు

- 12 ఏళ్ల క్రితం తల్లి మృతి
- ఆదివారం అనారోగ్యంతో చనిపోయిన తండ్రి

రామారెడ్డి: అభం శుభం తెలియని ఆ చిన్నారులను దేవుడు అనాథలను చేశాడు. పసితనంలోనే తల్లిని దూరం చేసుకున్న వారికి తాజాగా తండ్రిని దూరం చేశాడు దేవుడు. తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులు అనాథలుగా మారారు. రామారెడ్డి గ్రామానికి చెందిన ఎర్రోళ్ల లింబాద్రి, శోభ దంపతులకు ఇద్దరు పిల్లలు నితిన్‌(12), నిరోషణ(10) ఉన్నారు. 12 ఏళ్ల క్రితమే శోభ అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటి నుంచి ఎర్రోళ్ల లింబాద్రి, తల్లిదండ్రుల సహాయంతో పిల్లలను పెంచాడు. ఆదివారం అనారోగ్యంతో లింబాద్రి కూడా మృతి చెందడంతో పిల్లలిద్దరూ అనాథలయ్యారు. 80 ఏళ్లు నిండిన నానమ్మ, తాతయ్య దగ్గర ఉంటున్నారు.



నానమ్మ, తాతయ్యతో చిన్నారులు

దళితబంధులో ప్రాధాన్యత ఇవ్వాలి

ఖలీల్‌వాడి: దళిత బంధులో ఎస్సీ ఉప కులాలకు ప్రాధాన్యత నివ్వాలని ఎస్సీ ఉపకులాల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు పరుశురాం అన్నారు. నగరంలోని జిల్లా గోసంగి సంఘం భవనంలో ఎస్సీ 57 ఉపకులాల హక్కుల పోరాట సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పరుశురాం మాట్లాడుతూ.. ఎస్సీ మాల, మాదిగ కులాలే కాకుండా 57 వెనకబడ్డ కులాలు ఉన్నాయన్నారు. వాటి అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో 25 లక్షల జనాభా కలిగిన ఉపకులాలపై ప్రభుత్వానికి చిన్న చూపు తగదని అన్నారు. నామినేటెడ్‌ పదవులు ఇచ్చి ఉప కులాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రతినిధులు అంకమొల్ల సాయిలు, గంధం బుద్దిరాజు, ఈర్నల వెంకట రమణ పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న నాయకులు

జాతీయస్థాయి ఫుట్‌బాల్‌లో ప్రతిభ

భిక్కనూరు: ఢిల్లీలో జరిగిన అఖిల భారత స్థాయి అండర్‌-12 విభాగంలో ఫుట్‌బాల్‌ క్రీడలో తెలంగాణ జట్టు ఆదివారం విజయం సాధించింది. ఫైనల్‌లో ఢిల్లీ- తెలంగాణ జట్లు తలపడగా 0-4 గోల్స్‌తో తెలంగాణ విజయం సాధించింది. ఈ విజయంలో భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన కైరంకొండ శరత్‌ చంద్ర మూడు గోల్స్‌ సాధించి తెలంగాణ జట్టు విజయానికి ఎంతగానో దో హదపడ్డా డు. శరత్‌చంద్ర మెదక్‌ జిల్లా రామాయంపేటలో విద్యను అభ్యసిస్తున్నాడు. శరత్‌ను భిక్కనూరుకు చెందిన పలువురు అభినందించారు.

